# అడవి మొక్క

కలప కోసం ఏజన్సీలో తెల్లవారి గుర్రం వేసుకు బయలు దేరేడంటే, రామస్వామికి 'ఆ' అంటే అడవీ 'కో' అంటే కోనలూ తిరిగి తిరిగి పని చూసుకుని వచ్చే వేళకు ఏడెనిమిది గంటలకు పైన పట్టేది. రామస్వామిని చూస్తే ఇతనికి కష్టాలు రాకూడదనిపిస్తుంది. ఆ దట్టించి కట్టిన పంచెతో జినుమీద చూడగానే అతని కోరమీసం ఆ చూపులోని ఒడుపూ, ఆ మనిషిలోని చేవ, ఆ చేతిలోని హంటరు ఝళిపింపుకు అడివి అడివంతా లొంగిపోవలసిందే. అడివే లొంగిపోగా ఆడదనగా ఎంత? ఆడవాళ్ళు–

వాడి పక్కన ఉన్నది, పచ్చుల పిడిబాకు
అది ఎదలో ఒకసారి అదిమినా చాలోయి–
ఉంగరాల జుట్టు రంగైన మగవాడు
కోపాన ఒకసారి కసరి తిట్టినచాలు అనుకుని
'మగవాని కౌగింట మరణించినా చాలు
కంటికి కనబడితేనా వాడు–కదలునా అడుగేసి...'

అని దారులు కాసేవారట. అతని కోసం పొరుగూళ్ళో పని కల్పిస్తే ఆ వ్యవహారం అర్థ మధ్యస్తంగా వదిలేసి ఎక్కడికో మాయమయి పోయేవాడు. అతన్ని తండ్రి వ్యవసాయంలో పెట్టాడు. వ్యవసాయం మన్ను కొట్టుకు పోయింది. వ్యాపారంలో పెట్టాడు. అది నీళ్ళు కారిపోయింది. గోదారి గట్టు మీద గుర్రంమీద వచ్చే రామస్వామిని చూస్తే వెర్రిభ్రమచేత ఆడపిల్లలచేతుల్లో బిందెలు నీటిలో మునిగేవి కావు.

ఆ అడవులు, ఆ పల్లెలు, ఆ కొండలు, రాళ్ళు, అక్కడి ఏరులు, చిన్న చిన్న వాగులు సైతం తెలిసిన వాడు. అందులో ఎరుకలు, కోయలు, గదబలు, కొండజాతి వారు

అనేకులు ముఠాలు ముఠాలుగా జీవిస్తూ ఉండేవారు. ఉప్పు, అగ్గిపెట్టెలు, సూదీ దారం, అద్దాలు పట్టుకు వెళ్ళేవాడు. ఇతను, వారందరికీ ఇష్టసఖుడు.

ఇలా ఉండగా–

జమిందారులు యుద్ధంలో అడివిని అమ్మేసి బంగారం పోగేశారు. రామస్వామి అడివిలోనే మకాం పెట్టాడు. బంగారంలాంటి అనుభవాన్ని పోగేశాడు.

అడవిలో ఒకచోట ఒక ఎత్తైన గుట్ట ఉన్నది. దాని మీద ఉన్న చెట్లు ఇన్నీ అన్నీ కావు. ఆ ప్రక్కన ఒక కుటం ఉన్నది. అందులోకి ఎక్కడ నుంచి వస్తుందో తెలియదు కాని కొండరాళ్ళ మధ్య బాటలలో నుంచి నిరంతరం నీళ్ళు కారుతూ ఉంటాయి. చుట్టూ మొక్కలూ మొటికలూ ఉన్నాయి. అటువంటి మెరుగైన చోట ఒక సాయంత్రం ఇంటికి మళ్ళుతూ గుర్రానికి నీళ్ళు పట్టించటం కోసం త్రిప్పగానే–

అంతవరకూ గట్టుమీద ఇసికలో కొంతా నీటిమీద కొంతా శరీరాన్ని జారవిడిచి వెల్లకిలాపరుండి మబ్బుల్నీ, పాలపిట్టల్నీ, చెట్ల ఆకుల గలగలను వింటూ స్వప్నావస్థలో ఉన్న లంబాడీ చిన్నది చేపలా నీటిలోకి దిగజారింది. తలకట్టు, ఓరచూపులు ఇవే మిగిలాయి. రామస్వామి గుర్రంమీదనుంచే కమిచీతో చిన్నదాని దుస్తులు అందిపుచ్చుకొన్నాడు. ఆ వెర్రెత్తించే బుజాల వంపులకి, ఆ చిన్ని చిబుకానికి, నీళ్ళలో తడిసి ఎదురు రొమ్ములమీద ప్రాకుతూ ఆడుకుంటున్న ఆ జుత్తుకీ దాసోహమనక ఏమిచేస్తాడు ఏ మగ మహారాజు మట్టుకూ?

ఆ బట్టల్ని చిటారు కొమ్మన మిఠాయిపొట్లంలా కట్టి తనువు మరచి తాహత్తు మరచి నీటిలోకి దిగాడు ఉంగరాల జుత్తు రంగైన మగవాడు రామస్వామి. ఆ లంబాడీ చిన్నది ఆవలి తట్టునుంచి గట్టుమీదకు ప్రాకి రామస్వామి లాల్చీ పంచె పట్టుకుని పరుగెత్తింది. ఈ కవ్వింపుతో అడివి అడివంతా అర్థమయింది రామస్వామికి. పురూరవుడిలా వెంటబడి తరిమి తరిమి పట్టుకున్నాడు ఆ చిన్నదాన్ని.

చెంపనా సంపంగి నూనె.
అంచునా చెంగల్వ మొగ్గ
ఏటివడ్డున ఇల్లు కడదాం పదరా
చల్ మోహన్‌రంగా

అనుకున్నారు. తరువాత వారికి లోకంతో నిమిత్తం లేకుండాపోయింది. చెట్టాపట్టా లేసుకుని....

వేళజూడ వెన్నెలాయె, వెండికట్ల కిన్నెరాయె
మల్లెపూల పందిరాయె, వయ్యారి రావె
నువ్వులోనె తెల్లవారును,

కొండగోగులు పూసెనేమొ, కొండ
నిమ్మలు కాసెనేమొ,
దొండపండు లాంటి పెదిమె,
వయ్యారి రావె
మనసు ఎవరి పాలు జేతును?
మల్లెపూవులు పూసినట్లు
మళ్ళి మళ్ళి మాటలాడు
మల్లెపూలవంటి మనసు వయ్యారి రావె
–పూవులెవరి పాలజేతును?

అప్పుడు మేలినడల అందమైన వయ్యారివచ్చి గంధం పూయించుకునేది. అడివిపూలు ముడిపించుకునేది. అడవి మొక్కకు అడివిపూలే అందం. అంతా వింత వింత రంగులతో అలంకరించు కున్నట్లు, సృష్టి అంతా తమ కోసమే వేచిఉన్నట్లు. గాలివీస్తే, ఆకులల్లలాడితే, పిట్టలుకూస్తే అవి తమ మోహాన్ని గూర్చే చెప్పుకుంటున్నట్లు, తోచేది రామస్వామికి.

ఈలోగా గోదావరి వరద లొచ్చేయి. జీడిమామిడీ తోటలు మునిగిపోయాయి. వరద గోదావరికి కొబ్బరికాయలు కొట్టి అరటిపళ్ళు నైవేద్యంపెట్టి పసుపు కుంకుమా ఇచ్చి జనులు మంగళ హారతులు పాడారు. ఏమని?

'నూనె ధారకుమల్లె నురగాలు ఎత్తుచు
పాల ధారకుమల్లె పరుగెత్తుచూ
ముల్లనక ముడికనక కఱ్ఱనక కంపనక
చెలరేగి ప్రొద్దేడ కదిలేటి గంగా'

ఆ వరదల్లో రామస్వామి చేసిన తప్పు, ఆ అడివిమొక్కను ఊళ్ళోకి తెచ్చాడు. ఊరు గుప్పుమంది.

'కామార్తాహి ప్రకృతి కృపణాస్చేతనా చేతనేషు'

కోడలు నరసమ్మ కాపురానికి వచ్చింది అని గింజుకున్నాడు రామస్వామి తండ్రి. వెఱ్ఱిబాగులది తనకోక ఎత్తుకుపోతున్నా చూస్తూ ఊరుకునేది. మగ మహారాజులను ఏమన గలదు?

'బటానీల కోకమీద కన్నేసాడే!
'సెనగపువ్వు రయికమీద చెయ్యేసాడే' అంటూ నాయుడికి వినిపించేలా గోలచేసే వారు కుఱ్ఱకారు. అనుభవాలు ఎవరికి మాత్రం కలగవు? చేలల్లో, సంతల్లో, డొంకలమ్మట,పుంతలమ్మట, గాదెల వెనకాల, గడ్డివాముల ప్రక్కన, వర్షంలో, ఎండలో, వెన్నెట్లో, చీకట్లో, ఎరుపో, తెలుపో, నలుపో, మనస్సులోనుంచి ఆత్మను చుట్టబెట్టే ఈ

లోకానుభూతులను ఎట్లా కాపాడుకోవాలో ఆ ఒడుపు తెలియని వాళ్లు లోకానికి బలి అవుతారు. వెంట అపప్రథలే మోసుకుని తిరుగుతారు. లంబాడీ చిన్నదానికి అద్దాల పరికిణీ జుబ్బాకి బదులు చీరా రవికా కట్ట బెట్టాడు.

తోటలో డాబాకి దాని మకాం మార్చి అడివితో విరోధం తెచ్చుకున్నాడు. ఊరు ఊరంతా అలిగింది.

ఆకుపచ్చని సిరాలాటి అడివిలో, నీలి నీలాంబరపు కప్పుక్రింద, కొండ కోనలలో చిక్కిన అడవి మొక్క నాలుగు గోడల నాగరికతకు ఎదురు తిరగనారంభించింది.

ఇల్లరికం వెళ్ళిన నారాయణస్వామి తమ్ముడు కుత కుతా ఉడికిపోతున్నాడు. మరదలు లాంటి బందుగుల సంగతి సరేసరి.

ఆ ప్రణయం ఆ మోహం ఎలాటిదని తోట నడిగితే, తోట అంటుంది కదా-

'కళ్లల్లో ముద్దెట్టుతూ-తెల్లారనీ నంటదీ
తెల్లారి పోతుంటె తా-నెల్లాగో
అయిపోతదీ' అని

రామస్వామి నడిగితే-

'చీకట్లో కేకెడతదీ, కేకెడుతు కిందడతదీ
ఏకాడ తడుమూదురా? ఆ కన్నె
అతి లేతరా!
పీకాను కాలేతునో?-
పయ్యెంట చెయ్యెంతునో?'

అని వాపోతాడు.

అడివి అంతా తిరగబడింది, దాని వాళ్ళంతా దానికోసం వచ్చారు. అర్ధమరేతిరి నిద్దురలో లేపినందుకు గనిసి

'చిన్నాది పూదేనెరా-కవటాకులో ఈనెరా
పున్నామి నెలబరణిరా-
ముమ్మొదట నా రాణిరా!'

అని సమాధానం చెప్పి చూశాడు. కుదరలేదు. దొమ్మీలో రామస్వామి బాణాకర్ర విరిగి పోగానే చీరల్లో రవికల్లో ఇముడని ఆ అడవి మొక్క వచ్చి అతడ్ని వాటేసుకున్నది.

విసరిన కత్తిపోటుకు లంబాడీ చిన్నది చిలకలా ఉన్నది తోటలో నెత్తుడి మడుగులో తురాయి చెట్టులా కూలింది.'

'ఊదేస్తె గాలౌతదీ-రోదిస్తె నభమవుతదీ
దరి తీస్తె నీరౌతదీ-బరిగీస్తె ధరణవు తదీ

పొగకర్ర కగ్గవుతదీ–ఇగ నాకు దారేదిరా?'

అని చెప్పుకుని చెప్పుకుని ఏడ్చాడు రామస్వామి!

కామాంధుడవు పోప్–పొమ్మంది లోకం.

ప్రేమించకు! అడవి మొక్కను ప్రేమించకు అని తోట చెప్పింది.

(షరా: –

'నావపై పిల్ల' పాట వ్రాసిన కవి కొండల వెంకటరావు గారికి వందనాలు!

డాక్టర్ రామరాజు గారి జానపద గేయాల థీసిస్సు ఎలా చదివానో నాకైతే జ్ఞాపకం లేదుకాని, అప్పుడు ఢిల్లీలో నోటు చేసుకున్నాను నాకు నచ్చిన పదాలను. వారికి చాలా థాంక్స్. గురువుగారు 'రామకృష్ణశాస్త్రిగారు' వెళ్ళిపోయారనగానే మనస్సు చివుక్కుమని వ్రాశాను ఏదో ఉడతాభక్తి! ఇంకోటి మన కుర్రాళ్ళకు మంచి ప్రేమ కథ వోటి అందించాలనే ప్రయత్నం చేశాను పాత ఫక్కీలో. అదీగాక కొత్త పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ మల్లెపందిరి క్రింద చదువుకుని ఆనందించేలా వ్రాయాలని కూడా తోచింది. అంతే!)